ప్రజాశక్తి

శుక్రవారం 8 సెప్టెంబర్ 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా

ప్రకాశం బ్యారేజికి వరద

డ్రగ్స్ కంట్రోల్ అధికారుల తనిఖీలు

నకిలీ మందుల గుర్తింపు

వార్త మెయిన్‌లో

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కె.రోజా, చిత్రంలో ఎంఎల్‌ఎ సారథి, కలెక్టర్ రాజాబాబు

నెలాఖరులోగా ఈక్రాప్ నమోదు పూర్తి

- పెనమలూరు నియోజకవర్గ సమీక్షలో మంత్రి రోజా ఆదేశం
- పలు సమస్యలను ప్రస్తావించిన ఎంఎల్‌ఎ సారథి

ప్రజాశక్తి - ఉయ్యూరు : రైతులు పండిస్తున్న పంటలు ఈక్రాప్‌లో నమోదు చేసే ప్రక్రియను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని కృష్ణాజిల్లా ఇన్చార్జి మంత్రి, పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. ఉయ్యూరు మండలం ఆకునూరులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం పెనమలూరు నియోజకవర్గ సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలైన అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలను శాఖల వారీగా సమగ్రంగా సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి రోజా మాట్లాడుతూ (మిగతా 6లో)

పర్యావరణంపై ప్రజల్లో చైతన్యం అవసరం

ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి - విజయవాడ, విజయవాడ అర్బన్ : వాయుకాలుష్యానికి కారణమయ్యే కర్బన ఉద్గారాల వినియోగంపై ప్రజలు చైతన్యవంతులై పర్యావరణ సమతుల్యతను కాపాడాలని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులు మంత్రిత్వ శాఖ జాతీయ, రాష్ట్ర, పట్టణ స్థాయిలో ప్రతి ఏటా సెప్టెంబర్ 7న నిర్వహించే 4వ అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన నీలి ఆకాశం దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఈట్ స్ట్రీట్ నుండి బెంజ్ సర్కిల్ వరకు, అక్కడి నుండి రాఘవయ్య పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు పర్యావరణహిత జీవనశైలి'పై పర్యావరణ అనుకూలమైన రవాణా విధానాల వినియోగాన్ని ప్రోత్సహించడంతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని లక్ష్యంగా పెట్టుకోవాలని సైకిల్ థాన్ - వాక్ థాన్ ద్వారా సందేశం ఇచ్చారు. కాలి నడకన, సైకిళ్ళతో నిర్వహించిన ఈ అవగాహనా ర్యాలీని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు మల్లాది విష్ణు జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఎలు వెలంపల్లి (మిగతా 6లో)

ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ విష్ణు

లగడపాటి రీ ఎంట్రీ ?

- టిడిపి విజయవాడ ఎంపి అభ్యర్థిగా తెరపైకి !
- అనుచరుల లీక్‌లతో శ్రేణుల్లో అయోమయం

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

రాష్ట్ర రాజకీయాల్లో ఒకప్పుడు క్రియాశీలకంగా ఉండి ప్రస్తుతం సైలెంట్‌గా ఉన్న విజయవాడ మాజీ పార్లమెంట్ సభ్యులు లగడపాడి రాజగోపాల్ రీఎంట్రీ దిశగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు చర్చించుకుంటున్నారు. విజయవాడ పార్లమెంట్ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమైనట్లు ఆ పార్టీ కార్యకర్తల్లో ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం సిట్టింగ్ ఎంపిగా టిడిపికి కేశినేని ఉన్నారు. అయితే ఎంపి కేశినేని తరచూ సొంతపార్టీ నేతలపై విమర్శలు చేస్తుండడంతో ఆయన సోదరుడు కేశినేని చిన్ని పేరు ఇప్పటి వరకు బలంగా వినిపిస్తోంది. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయవాడ లోక్‌సభ అభ్యర్థిత్వం చిన్నికి ఖరారు కావచ్చని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు భావిస్తున్న తరుణంలో అనూహ్యంగా లగడపాడి రాజగోపాల్ పేరు తెరపైకి రావడంతో రాజకీయ వాతావరణం ఆసక్తికరంగా మారింది. టిడిపి అధికష్టానం త్వరలో లగడపాడి పేరును వెల్లడించే అవకాశం ఉందని ఆ పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. టిడిపికి కంచుకోటగా ఉన్న విజయవాడలో తమ పార్టీకి పూర్వ వైభవం తేవాలనే పట్టుదలతో పార్టీ అధినేత చంద్రబాబు ఉన్నారు. ఈ నేపథ్యంలో లగడపాటి అయితే విజయవాడ టిడిపి నేతలందరినీ ఒక తాటిపైకి తీసుకొని రాగలరని, సులభంగా గెలుపు సాధ్యం అవుతుందని భావిస్తున్నట్లు తెలిసింది. 1982 నుంచి 2019 వరకు జరిగిన ఎంపి ఎన్నికల్లో ఐదుసార్లు టిడిపి అభ్యర్థులు గెలుపొందారు. 1984, 1991లో ఎన్నికల్లో టిడిపి నుంచి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఎంపిగా గెలిచారు. 1999లో ప్రస్తుతం విజయవాడ తూర్పు ఎంఎల్‌ఎగా ఉన్న గద్దె రామ్మోహన్ గెలవగా, 2014, 2019ల్లో కేశినేని నాని విజయం సాధించారు. రాష్ట్ర విభజనకు ముందు కాంగ్రెస్ పార్టీ నుండి లగడపాటి రాజగోపాల్ విజయవాడ ఎంపిగా గెలుపొందారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004 నుంచి 2009 వరకు ఎంపిగా ఉన్నారు. నాడు టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన వల్లభనేని వంశీమోహన్‌పై గెలుపొందారు. వంశీకి 4,16,682 ఓట్లు రాగా, లగడపాటికి 4,29,394 ఓట్లు పోలయ్యాయి. దాదాపు 12వేల పైచిలుకు మెజారిటీతో లగడపాటి గెలుపొందారు. ఈ నేపథ్యంలో లగడపాటికి టికెట్ ఇస్తే బాగుంటుందని చంద్రబాబు ఓ నిర్ణయానికి వచ్చినట్లు ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. ఇదిలాఉండగా, లగడపాటి అనుచరుల పేరుతో బుధవారం నగరంలోని ఓ హోటల్ సమావేశమైన కొందరు ఆయన తిరిగి రాజకీయాల్లో రావాలని డిమాండ్ చేస్తున్నట్లుగా లీకులు ఇచ్చారు. ఈసమావేశంలో విజయవాడ రాజకీయాలపై చర్చించుకున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ ఆక్టోపస్‌గా పేరున్న లగడపాడి 2014లో ఉమ్మడి రాష్ట్రం విడిపోవడానికి ముందు సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లలో ఆయన నిర్వహించిన ఎన్నికల సర్వే అంచనాలకు, వాస్తవ ఫలితాలకు భారీ తేడా రావడంతో ముందు రాజకీయాలకు, 2019 ఎన్నికల ఫలితాల తర్వాత సర్వేలకూ దూరంగా ఉంటున్నారు.

ఓటర్ల జాబితా విచారణ వేగవంతం

వివిధ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ: ఓటర్ల జాబితా నుండి తొలగించిన ఓటర్ల పేర్లను పునఃపరిశీలన, విచారణ ప్రక్రియ విజయవంతం చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. స్పెషల్ సమరీ రివిజన్-2024లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్‌లో గురువారం జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జూలై 21 నుండి ఆగస్టు 21వ తేదీ వరకు డోర్ టు డోర్ వెరిఫికేషన్, తొలగించిన ఓటర్ల జాబితా పరిశీలన తదితర అంశాలపై రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించారని అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు వెరిఫికేషన్ ప్రక్రియలో సేకరించిన ఫారం-6, 7, 8కు సంబంధించి నమోదైన వాటిలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో ఫారం -6 కు సంబంధించి 57,996 దరఖాస్తులు, ఫారం -6ఏకు సంబంధించి 14 దరఖాస్తులు, ఫారం-7కు సంబంధించి 45,842 దరఖాస్తులు, ఫారం-8 కు సంబంధించిన మొత్తం 78,586 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటి పరిశీలనలో సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేస్తున్నామని చెప్పారు. నగరంలోని అపార్టమెంట్లలో నివాసం ఉంటున్న వారికి డోర్ నెంబర్‌తో పాటు ఫ్లోర్, బ్లాక్‌ల వారీగా కేటాయించడంతో ఒకే డోర్ నెంబర్‌లో ఎక్కువ ఓటర్లు ఉంటున్నట్లు వస్తున్న ఫిర్యాదులకు పరిష్కారం లభించిందన్నారు. 18 ఏళ్ళు నిండిన యువ ఓటర్ల నమోదు నిరంతరం జరుగుతుందన్నారు. ఈఏడాది అక్టోబర్ 17న ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఎలక్ట్రోరల్ రోల్ ప్రచురిస్తామన్నారు. అప్పటి నుండి వివిధ ప్రక్రియల అనంతరం 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని తెలిపారు. జాబితా ప్రచురణకు సంబంధించి నిర్వహిస్తున్న ప్రక్రియను ఎప్పటికప్పుడు రాజకీయపార్టీల ప్రతినిధులకు సమాచారం అందిస్తామని, తప్పులు లేని, స్పష్టమైన ఓటర్ల జాబితా ప్రచురణలో పూర్తి సహకారం అందించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ కోరారు. ఈనెల 8న గొల్లపూడి మార్కెట్ యార్డ్‌లో జిల్లాకు సంబంధించి కొత్తగా నిర్మించిన ఈవీయం గోడౌన్‌కు బెంగుళూరు నుండి 15 వేల ఈవీయంలు, వివి ప్యాట్స్‌లు, రానున్న దృష్ట్యా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆ గోదాములో ఉంచుతామని, ఈ కార్యక్రమానికి ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. ఈసమావేశంలో డిఆర్‌వో కె.మోహన్‌కుమార్, వైసిపి ప్రతినిధి పి.రాజశేఖర్, టిడిపి ప్రతినిధి ఎల్ శివరాం ప్రసాద్, కాంగ్రెస్ ప్రతినిధి బొర్రా కిరణ్, సిపిఐ ప్రతినిధి ఎం.సాంబశివరావు, బిజెపి ప్రతినిధులు పివి శ్రీహరి, ఎ. రాజేష్‌కుమార్, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వసుధారాణిని సన్మానిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

ప్రముఖ రచయిత్రి వసుధారాణికి కలెక్టర్ సత్కారం

ప్రజాశక్తి-విజయవాడ: తెలుగు భాషాభివృద్ధికి, సాహిత్యాభివృద్ధికి ఎనలేని సేవలు అందిస్తున్న రచయిత్రి రూపెనగుంట్ల వసుధారాణి అభినందనీయురాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం ప్రముఖ రచయిత్రి రూపెనగుంట్ల వసుధారాణిని కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ఆగస్టు 29న గిడుగు వెంకట రామూర్తి పంతులు జయంతి సందర్భంగా నగరంలోని స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో భాష సాంస్కృతిక శాఖ, అధికార భాష సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి తెలుగు భాష మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో తెలుగు భాషాభివృద్ధికి, సాహిత్యాభివృద్ధికి ఎనలేని సేవలు అందించిన 49 మంది కవులు, కళాకారులు, రచయితలను ఘనంగా సన్మానించినట్లు చెప్పారు. సన్మాన గ్రహీతలలో ప్రకాశం జిల్లా వేటపాలెంకి చెందిన వసుధారాణి రచించిన 'కేవలం నువ్వే', 'దేవకాంచనం నీడన', 'నది వెంట నేను' అనే పుస్తకాలు ప్రముఖంగా నిలిచాయని, వీటితోపాటు ఆమె పలు పత్రికలకు శీర్షికలు, రచనలు రాశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో కె. మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

వెలంపల్లి, భాగ్యలక్ష్మి పర్యటన

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక భవానీపురంలో ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ కరెంట్ ఆఫీస్ రోడ్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు నగర పాలక సంస్థ అధికారులతో కలిసి గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్టాండింగ్ కమిటీ సభ్యులు గుడివాడ నరేంద్ర రాఘవ, కార్పొరేటర్లు అంజనేయరెడ్డి, చైతన్యరెడ్డి, బాపతి కోటిరెడ్డి, రత్నకుమారి, మాధురి లావణ్య, కృష్ణ, దుర్గారావు పాల్గొన్నారు.

ఐసిఐసిఐలో 158 శాతం వృద్ధి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 2020 ఆర్థిక సంవత్సరం నుండి 2023 ఆర్థిక సంవత్సరం వరకు దాని హామీ ఇవ్వబడిన పొదుపు ఉత్పత్తుల (గ్యారంటీడ్ సేవింగ్స్ ప్రొడక్ట్స్) విభాగంలో 158 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు సంస్థ ఎక్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ హెచ్. వినోద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంజి రోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.. వృద్ధి పరంగా ఈ పెరుగుదల హామీ ప్రయోజనాలను అందించే ఉత్పత్తుల పట్ల కస్టమర్ ప్రాధాన్యతను స్పష్టంగా వెల్లడి చేస్తుందని అన్నారు.. స్టాక్ మార్కెట్లలో పెరిగిన అస్థిరత కారణంగా గ్యారెంటీ ప్రయోజనాలను అందించే ఉత్పత్తుల వైపు కస్టమర్ ప్రాధాన్యత మళ్ళింది అని తెలిపారు.. గ్యారంటీడ్ బెనిఫిట్ ప్రొడక్ట్స్ మూలధన భద్రతను, స్థిరమైన రాబడిని అందిస్తాయని అన్నారు.

సైన్స్ పోటీల్లో రోషన్‌కు బహుమతి

అజిత్ సింగ్ నగర్ : 4వ అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి, నీలి ఆకాశం సందర్భంగా మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు జరిగిన సైన్స్ ప్రాజెక్ట్ పోటీలలో 59 డివిజన్‌లోని ఎమ్.కే. బేగ్ మునిసిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ స్కూల్ 5వ తరగతి విద్యార్థిని షేక్ రోషన్ ఆరా ప్రథమ బహుమతిని గెలుచుకుంది. గురువారం ఉదయం ఇందిరా గాంధీ స్టేడియం ఫుడ్ కోర్ట్ వద్ద జరిగిన బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా విద్యార్థిని రోషన్ సర్టిఫికెట్‌ను, వెయ్యి రూపాయల నగదు బహుమతిని, మొక్కను అందుకుంది. పాఠశాల అసెంబ్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎమ్.ఎస్.ఇమామ్ బాషా విద్యార్థిని రోషన్‌ను, ఆమె తల్లిదండ్రులు షేక్ రబ్బానీ, అజీజా బేగంలను సన్మానించారు. 5 వ తరగతి టీచర్లు టి. హేమలత, కె.శ్రీనివాస రావు, ఇతర టీచర్లు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుండి భవానీపురం దర్గా ఉరుసు మహోత్సవాలు

ప్రజాశక్తి-విజయవాడ: భవానీపురం స్వాతి థియేటర్ సమీపంలోని హజరత్ సయ్యద్ అమినుద్దీన్ బాబా వారి 39వ ఉరుసు మహోత్సవాలు ఈనెల 8, 9, 10 తేదీల్లో జరుగుతాయని దర్గా ముటవల్లి సయ్యద్ మొహమ్మద్ ఖాజామొయిద్దీన్ చిష్తి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఉరుసు ప్రారంభోత్సవం జరుగుతుందని తెలిపారు. 9వ తేదీ సాయంత్రం 6 గంటలకు దర్గా ప్రాంగణం నుండి గంధం ఊరేగింపు బయలుదేరి బ్యారేజీ, మార్కెట్, వించిపేట, సొరంగం మీదుగా రాత్రి 9 గంటలకు తిరిగి దర్గా వద్దకు చేరుకుంటుందని తెలిపారు. 10వ తేదీ సాయంత్రం 6.45 గంటలకు దీపారాధన అనంతరం అన్నప్రసాదం పంపిణీ, ఖావ్వాలి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

కృష్ణాష్టమి సందడి

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం కొత్తపేటలోని శ్రీ సత్యభామ రుక్మిణి సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి , జనసేన విజయవాడ నగర అధ్యక్షుడు పోతిన వెంకట మహేష్, కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు శ్రీ వేణుగోపాల స్వామి వారిని దర్శించుకున్నారు. దేవస్థానం కమిటీ అధ్యక్షులు వంజరపు సూర్యారావు, కార్యదర్శి మురపాల దుర్గారావు, కమిటీ సభ్యులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

కొండపల్లిలో శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొండపల్లి పుర వీధుల్లో కృష్ణుడు విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఇబ్రహీంపట్నం ఫెర్రీ వారిచే కోలాటం మరియు ఉట్టికొట్టే కార్యక్రమం అలరించాయి. కొండపల్లి లోని యాదవుల బజార్లో ఏర్పాటు చేసిన కృష్ణుని విగ్రహం ఊరేగింపు ఉట్టి కొట్టే కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలోని ఫెర్రిలో జరిగిన కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.

కొత్తపేటలో వేణుగోపాలుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే, మేయర్

'భవిత్'లో...

ప్రజాశక్తి-వన్‌టౌన్: భవానీపురంలోని భవిత్ స్పెషల్ నీడ్ డెవలప్మెంట్ సెంటర్‌లో గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భవిత్ స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ స్కూల్ ప్రిన్సిపల్ జె.సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలు ధరించి అలరించారు. ఉట్టి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ జె.సునీత మాట్లాడుతూ మానసికంగా, బలహీనంగా ఉండే పిల్లలను సాధారణ పిల్లలుగా తీర్చిదిద్ది, వారిలో నైపుణ్యతను పెంపొందిస్తూ, వారు కూడా సాధారణ పిల్లలుగా సమాజంలో గుర్తింపు పొందేలా చేసేందుకు తాము కృషి చేస్తున్నామని తెలిపారు.

10న 'వేడుకోలు' దీక్షను విజయవంతం చేయాలి

• సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఏసి పిలుపు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సమగ్ర శిక్ష, కేజీబీవీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జె ఏ సి ఆధ్వర్యంలో ఈ నెల 10 తేదీన కృష్ణా జిల్లా కలక్టరేట్ వద్ద ' వేడుకోలు' నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఉద్యోగుల జె ఏ సి వైస్ చైర్మన్ సి హెచ్ ఎన్ దేవేంద్ర రావు తెలిపారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో దేవేంద్ర రావు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ,కేజీబీవీ లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులను ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే రెగ్యులర్ చేయాలని, సుప్రీం కోర్టు చెప్పినట్లు వెంటనే సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందరికీ మినిమం ఆఫ్ టైమ్ స్కేల్ అమలు చేసి వేతనాలు పెంచాలన్నారు. ఔట్సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోనికి మార్చి మినిమం ఆఫ్ టైమ్ స్కేల్ అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి తక్షణమే ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేసి వేతనాలు పెంచాలన్నారు. ఇంటి అద్దె సౌకర్యం, కరువుభత్యం, 10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలన్నారు. సామాజిక భద్రతా పథకాలైన ఈపీఎఫ్, ఈఎస్ఐ, అమలు చేయాలని,పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేసి, మెరుగైన హెల్త్ స్కీమ్లు అమలు చేయాలన్నారు. అదేవిధంగా ఖాళీ పోస్టులను భర్తీ చేసి పని భారం తగ్గించాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు సమగ్ర శిక్ష ఉద్యోగులకు వర్తింపజేయాలన్నారు. ఎక్స్గ్రేషియో 20 లక్షలకు పెంచాలని. పెండింగ్ ఎక్స్గ్రేషియాలను మానవత్వంతో తక్షణమే చెల్లించా లన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలను వెంటనే ఆదుకోవాలన్నారు. వారి కుటుంబం లో ఒకరికి ఉద్యోగం ఇచ్చి కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయాలన్నారు. అన్ని పోస్టులకు ఖచ్చితమైన జాబ్ చార్ట్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి కె వి.వెంకటేశ్వరరావు లు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం రామ రాజుపాలెం గ్రామం సమీపంలో గురువారం కారు ప్రమాదం జరిగింది. విజయ వాడ నుండి భీమ వరం వెళు న్న స్విఫ్ట్ డిజైర్ కారు ప్రమాదవశాత్తు డివైడర్ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో ముగ్గురు కి తీవ్రగాయాలు కాగా మచిలీపట్నం ఆంధ్ర హాస్పిటల్ కు తరలించారు.వీరిలో బండి సోమేష్ పరిస్థితి విషమంగా ఉంది.గూడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పాదయాత్ర

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు లాం తాంతియ కుమారి అధ్వర్యంలో గురువారం స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి కోనేరు సెంటర్ మీదుగా రైతు బజార్ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ప్రారంభించి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా పాదయాత్రలకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి, అనంతరం అంబేద్కర్ సర్కిల్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ముస్లిం మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఫిరోజ్ బేగ్, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి, పిసిసి సెక్రెటరీ మొహమ్మద్ దాదాసాహెబ్, పెడన అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ అప్పారావు, డిసిసి మీడియా చైర్మన్ ఊటుకూరి శాంతిరాజు, బందరు మండల అధ్యక్షుడు పాండురంగ విటల్ కోన, డిసిసి సేవాదళ్ అధ్యక్షుడు చిలుగోటి ప్రసాదరావు, జిల్లా ఎస్సీ, ఎస్టీ అధ్యక్షులు రావు రమేష్, స్టేట్ మహిళా నాయకురాలు త్రిశూల చుక్క, అవనిగడ్డ ఎస్సీ సెల్ అధ్యక్షులు మండల అధ్యక్షులు రాఘవులు, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు 'భజరంగబలి శతకం' ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం దివ్యక్షేత్రంలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో తెలుగువేదకవి శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు రచించిన 'భజరంగబలి శతకం 'సెప్టెంబర్ 8వ తేదీన సాయంత్రం సాహితీసభలో ఆవిష్కరణ జరుగుతుందని- శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) తెలిపారు. ఈ సందర్భంగా తాడికొండ చిన్న మాట్లాడుతూ డా. రామకష్ణా ప్రసాద్, డా. పద్మావతి దాసరి దంపతులచే భజరంగబలి శతకం ఆవిష్కరణ జరుగుతుందన్నారు. ఈ సాహితీసభకు ముఖ్య అతిథిగా మండలి బుద్ధప్రసాద్, తోటకూర ప్రసాద్, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, పాలపర్తి శ్యామలనందప్రసాద్, వామరజు సత్యమూర్తి తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం అందజేస్తున్న దాతలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల భారతీయ ఆస్పటల్ సమీపంలో కేసన దానయ్య సురగం నాగమల్లిలకు చెందిన రెండు గహాలు దగ్ధం కావడంతో బాధితులకు అవనిగడ్డ నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చెన్ను రంగారావు ఆధ్వర్యంలో రెండు కుటుంబాల వారికి 25 వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పులిగడ్డ గ్రామపంచాయతీ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అందే జగదీష్, బీసీఐకి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్రామ మాజీ సర్పంచ్ చెన్నుగాంధీ, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆవనిగడ్డ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా హైదరాబాదుకు చెందిన ఎన్ మాక్స్ ఇంజనీరింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ 5000 గ్లోబల్ ఇన్వర్మెంటల్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ అధినేత కొండా శ్రీరామ్ రెడ్డి 5000 రూపాయలు మల్లేశ్వరం సర్పంచ్ చెన్ను శ్రీనివాసరావు చెన్ను ^ంగారావులు సంయుక్తం రూ.15000 అందించినట్లు రంగారావు తెలిపారు. ఈ సందర్భంగా చెన్ను రంగారావుదాతలకు కతజ్ఞతలు తెలియజేశారు.

త్రిపురనేని రచనలు సమాజానికి ఉపయోగకరం

పూర్ణచంద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుడివాడ : త్రిపురనేని గోపీచంద్ రచనలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉండేవని మునిసిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. గుర ువారం స్థానిక షా గులాబ్చంద్ ప్రథమశ్రేణి గ్రంథాల యంలో తెలుగుభాషా వికాస సమితి ఆధ్వర్యంలో త్రిపురనేని గోపీచంద్ 113వ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత పలువురు త్రిపురనేని గోపీచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన కార్యదర్శి డా.జి.వి.పూర్ణచంద్‌కు త్రిపురనేని గోపిచంద్ స్మారక పురస్కారం-2023ను అందించారు. ఈ సందర్భంగా తెలుగుబాషా వికాస సమితి అధ్యక్షులు డిఆర్‌బి ప్రసాద్ మాట్లాడుతూ సమాజానికి ఎంతో మేలు కలిగించే రచనలు చేసిన త్రిపురనేని జయంతిని తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తికొండ సుబ్బారావు, చింతపల్లి వెంకటరమణ, భవిరి శంకర్‌నాథ్, మోకా మాధవరావు, గాదె మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో విద్యాభివృద్ధి

దాతలు ఆవిర్నేని విష్ణువర్ధనరావు, స్వర్ణకుమారి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : విద్యాభివద్ధికి దాతల సహకారం అభినందనీయమని దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు హెచ్ఎం లూథర్పాల్ సూచించారు. రేమల్లె హైస్కూల్కు ఆవిర్నేని విష్ణువర్ధనరావు, స్వర్ణకుమారి దంపతులు 25 వేల విలువైన మల్టీ సౌండ్ సిస్టంను గురువారం అందజేశారు. ఉపాధ్యాయులను గౌరవిస్తూ ఇష్టంతో చదివితే సమాజంలో ఉన్నతశిఖరాలు అధిరోహిం చవచ్చని, విద్యాభివద్ధికి అవసరమైన సహకారమం దించేందుకు సదాసిద్ధమని గతంలో హైస్కూల్కు రెండు ఇనుప బీరువాలిచ్చిన దాతలు సూచించారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు దాతలను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో దారపురెడ్డి భాస్కరరావు, వెలమర్తి రవిబాబు, పర్వా రాజేష్, వెంకటకుమారి, తదితర ఉపాధ్యాయ లు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

బందరు రూరల్ సిఐగా బాషా

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : బందరు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టరుగా మహమ్మద్ హబీబ్ బాషా గురువారం బాధ్యతల స్వీకరించారు. 2009 వ సంవత్సరం బ్యాచుకు చెందిన ఎస్ఐ హబీబ్ బాషా గతంలో నగరంలోని ఆర్ పేట ఎస్ఐగా పని చేశారు. ఇప్పుడు సీఐగా పదోన్నతి పొంది బందర్ రూరల్ సీఐగా బదిలీపై వచ్చారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ పి జాషువాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతి బాధ్యతలను పెంచుతుందని, రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించి శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల అణచివేతలో ప్రముఖ పాత్ర పోషించాలని సూచించారు. మహిళల భద్రతకు కషి చేయాలని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయవద్దన్నారు.

వైస్ చైర్మన్‌గా నియామకంపై ధన్యవాదాలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ వింగ్ నేషనల్ వైస్ చైర్మన్‌గా నియమించినందులకు ఎన్‌సిపి మైనార్టీ విభాగం నేషనల్ చైర్మన్ శిరాజ్ మెహ్ది సాబ్‌కు జమీల్ అహ్మద్ బేగ్ ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా ఏర్పడిన ఎన్‌సిపి మైనార్టీ వింగ్ ఆఫీస్ బేరర్‌గా తనను నియమించినందులకు శిరాజ్ మెహ్ది సాబ్‌కు కతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో పార్టీకోసం మరింతగా కష్టపడి పనిచేస్తానని, పార్టీ ఆదేశాలను శిరసా వహిస్తానన్నారు. అన్ని వర్గాల వారి సమస్యల పరిష్కారానికి, మైనార్టీ వర్గాల అభివద్ధికి కషిచేస్తానని, తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకొని సేవ చేస్తానని జమీల్ అహ్మద్ బేగ్ తెలిపారు.

బహుమతులు అందజేస్తున్న బ్రాంచ్ మేనేజర్, అధికారులు

ముగిసిన ఎల్ఐసి వారోత్సవాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : భారతీయ జీవిత బీమా సంస్థ మచిలీపట్నం డివిజన్ పరిధిలోని అవనిగడ్డ బ్రాంచ్ 67 వార్షికోత్సవ వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. వారోత్సవాల సందర్భంగా ఈ నెల నాలుగో తేదీన వ్యాసరచన గురువారం డ్రాయింగ్ పోటీలు జరగగా విజేతలకు బ్రాంచ్ మేనేజర్ జి ఉమామహేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, ఏబీఎం సాయిరాం కిరణ్ సమక్షంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సమస్త ఉద్యోగులకు క్విజ్ ప్రోగ్రాం నిర్వహించగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది ఏజెంట్లు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ఎస్‌కెపివివి హైస్కూల్ కోశాధికారి విజయ్‌కుమార్

వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పాలకవర్గం

ప్రజాశక్తి-వన్‌టౌన్
విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ళ బాబా విజయ్ కుమార్ చెప్పారు. స్పోర్ట్స్ ఎక్సెలెన్సీ అవార్డు 2023-24 రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన నేపథ్యంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.వి.సత్యప్రసాద్, లక్ష్మీలను పాలకవర్గ సభ్యులు సత్కరించారు. పాఠశాల కమిటీ ప్రథమ కార్యదర్శి కేవల్వి మోహనరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ప్రణాళిక రూపొందించుకొని కష్టించే ఉపాధ్యాయులు ఉండబట్టే ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్స్ కమిటీ 120 ఏళ్లగా విజయకేతనం ఎగరవేస్తుందని ఆయన కొనియాడారు. కార్యదర్శి మోహనరావు మాట్లాడుతూ 26 జిల్లాలలో వేలాది పాఠశాలలు ఉండగా హిందూ హైస్కూల్ క్రీడల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకోవడం శుభపరిణామం అన్నారు. ఇది హిందూ హైస్కూల్స్ కమిటీకి గర్వకారణం అన్నారు. బీఈడీ కళాశాల కమిటీ అధ్యక్షులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, కేబీఎన్ కళాశాల కమిటీ కోశాధికారి అన్నం రామకష్టారావు మాట్లాడుతూ ఎనిమిది విద్యాసంస్థల్లో సుమారు 14 వేల మంది విద్యార్థులు, సుమారు 600 మంది ఉపాధ్యాయ సిబ్బందితో హిందూ హైస్కూల్ కమిటీ విరాజిల్లుతుందన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం అనసూయని కమిటీ ప్రతినిధులు సత్కరించారు. మద్ది సుబ్బారావు ఆంగ్ల మీడియం పాఠశాల కమిటీ అధ్యక్షులు మద్ది సుబ్బారావు, కోశాధికారి కొత్త నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యా వ్యాప్తికి నిరంతర కషి జరుపుతున్న తమ విద్యాసంస్థల్లో విద్యతో పాటు క్రీడలు, ఎన్ సి సి, సాంస్కృతిక విభాగాలకు సైతం పెద్ద పేట వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు, కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె నారాయణ రావు, కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి ఎల్ రమేష్, పాతబస్తీలోనే పలు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో అన్ అకాడమీ స్కాలర్‌షిప్ పరీక్ష

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: అన్ అకాడెమీ ఆధ్వర్యంలో అక్టోబర్‌లో స్కాలర్ షిప్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సెంటర్ హెడ్ వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. బెంజిసర్కిల్ వద్ద గల సంస్థ కార్యాలయంలో గురువారం పరీక్షకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ అకాడెమీ, విదీషా ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్తంగా ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్, డాక్టరు కలలను సాకారం చేసుకునేందుకు విద్యార్థులు కోచింగ్ కొరకుమహా నగరాలకు వెళ్లకుండా నగరంలోనే అన్ అకాడెమీ అందుబాటులో వుందని అన్నారు. ఐఐటి, నీట్ లో అనుభవం కలిగిన అధ్యాపకులచే శిక్షణ అందిస్తున్నామని అన్నారు. తాము నిర్వహించే పరీక్షకు 9 వ తరగతి నుండి 12 వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆఫ్ లైన్, ఆన్ లైన్ ద్వారా పరీక్ష రాయవచ్చని తెలిపారు. అక్టోబర్ 1, 8, 15 తేదీలలో అన్ అకాడెమీ సెంటర్లో నిర్వహించే ఈ పరీక్షకు విద్యార్థులు రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ పోస్టర్‌ని తెలుగు ఎన్‌డిఆర్ఎఫ్ కమాండెంట్ జహిద్ ఖాన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తన్నీరు ప్రసాద్ రావు, బిజినెస్ హెడ్ గోపీనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునేరు, కట్టలేరుకు వరద నీరు

వైరా- కట్టలేరు వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలం దాములూరు కట్టలేరు వాగుపై వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. తెలంగాణలో గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు నందిగామ, వీరులపాడు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణం ఉండటం వల్ల ప్రతిసారి వరద వచ్చినప్పుడల్లా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. రెండు మండలాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే అసంపూర్తిగా ఉన్న కూడలి బ్రిడ్జి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. **ప్రజాశక్తి-కంచికచర్ల:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కష్ణానది, మునేరు భారీ వరద నీరు చేరింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఖమ్మం, వరంగల్ ప్రాంతంలో కురిసిన వర్షాలకు వైరా ఏరు, కటలేరుకు భారీగా వరద చేరింది. దీంతో వీరులపాడు మండలం పల్లంపల్లి, కూడలి మధ్య కాజ్ వే పై వరద ప్రవాహం వల్ల రాకపోకలు నిలిచి పోయాయి. కీసర బ్రిడ్జి వద్ద మునేరు వరద పెరిగింది.

నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం
ఇబ్రహీంపట్నంలో మంచినీళ్ళ సరఫరా పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ దెబ్బ తినటం వల్ల మరమ్మత్తులు చేస్తున్నట్లు మైలవరం డిఈఈ ఎం దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం నుండి మూలపాడుకి వెళ్లే లైన్ కు కష్ణ వాటర్ రెండు రోజులు అంతరాయం కలుగుతుందని, ఇబ్రహీంపట్నం జూపూడి, కిలేశపురం, మూలపాడు గ్రామాలకు అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ప్రజలు అధికారులతో సహకరించాలని కోరారు.

యాగశాల శంకుస్థాపన కార్యక్రమంలో ఆలయ ఇఓ, చైర్మన్

యాగశాల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడిలో సుమారు రూ.3.80 కోట్ల వ్యయ అంచనాతో రాతి యాగశాల నిర్మాణానికి యనమలకుదురుకు చెందిన దాత, రాష్ట్ర ధార్మిక పరిషత్ సభ్యులు సంగా నరసింగారావు సహకారంతో గురువారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అలాగే శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయ ధ్వజస్తంభ ఏర్పాటు పనులు ప్రారంభ కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, దాత సంగా నరసింగారావు, నగర తూర్పు నియోజకవర్గం ఇంచార్జి దేవినేని అవినాష్, ఉప కార్యనిర్వాహణాధికారి పి. గురుప్రసాద్, పాలకమండలి సభ్యులు బుద్ధా రాంబాబు, చింకా శ్రీనివాసులు, చింతా సింహాచలం, నంబూరి రవి, బచ్చు మాధవి కష్ణ, ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్లు కేవీస్ కోటేశ్వరరావు, లింగం రమాదేవి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-వన్‌టౌన్: సమాజానికి ఎంతో విలువైన సేవలను అందిస్తున్న జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని ప్రజా వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ వి.శ్రావణ్‌కుమార్ అన్నారు. అందుకే తమ ప్రజా వైద్యశాల ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఉచితంగా బిఎండి పరీక్ష నిర్వహిస్తున్నామని చెప్పారు. గురువారం కొత్తపేట బ్రాహ్మణవీధిలోని ప్రజావైద్యశాలలో జర్నలిస్టులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతు తాము సామాజిక బాధ్యతగా పలు సేవా కార్యక్రమాలను, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆర్థోపెడిక్ డాక్టర్ సూర్యనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణకు ఈ వైద్యశిబిరం ఉపకరిస్తుందన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎంజి మోటార్స్ ఆస్టర్ ఎన్యూ వి విడుదల

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: రానున్న పండుగల సందర్భంగా ఎం.జి.మోటార్స్ ఆధ్వర్యంలో సరికొత్తగా ఎం.జి. ఆస్టర్ ఇండియాన్స్ మోస్ట్ అడ్వాన్స్‌డ్ ఎస్యూవి కారును మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని ఎం.జి.మోటార్స్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రానున్న పండుగల సందర్భంగా వినియోగదారులకు సరికొత్తగా కారును అందించాలనే ఉద్దేశంతో కంపెనీ నూతన కారును రూపొందించినట్లు తెలిపారు. విలక్షణమైన డిజైన్‌లో ప్రీమియం సెగ్మెంట్‌లో అత్యాధునికంగా ఆకట్టుకునే విధంగా రూపొందించారని అన్నారు. ప్రతి ఒక్కరూ చక్కటి డ్రైవింగ్ అనుభూతిని అందించేందుకు ఈకారు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మోడల్ లోపలి భాగం ఎరుపు రంగు కట్టుతో అందంగా తీర్చిదిద్దారని అన్నారు. రానున్న కాలంలో మరింత ఆకర్షణీయమంగా కార్లను రూపొందించనున్నట్లు తెలిపారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్
ప్రతి ఒక్కరికీ పోషకాహారంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈట్ రైట్ ఇండియా పేరుతో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు హెర్బాలైఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ ఖన్నా అన్నారు. నగరంలోని హెర్బాలైఫ్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడంలో ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. సురక్షితమైన, ఆరోగ్యవంతమైన, పోషకాహార ప్రాధాన్యతలను నిర్ధారించడానికి వివిధ ప్రాంతాలలో కలిసి పనిచేస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు, విద్యాలయాలు, కళాశాలలు, కార్యాలయాలు, ఆసుపత్రులు వివిధ ప్రాంతాలలో ఆహారం గురించి ఆహార ప్రణాళిక గురించి తెలియచేస్తున్నట్లు తెలిపారు. ఆహార దినోత్సవం సందర్భంగా ఇటువంటి కార్యక్రమం వివిధ సంస్థలతో కలిసి పని చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్‌సి వర్గీకరణకు వినతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి నెట్టెం రఘురాం జగ్గయ్యపేట నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్‌ని గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. సెప్టెంబర్ 18 నుంచి 22 వరకు జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి టిడిపి అధినాయకత్వం నుంచి లేఖ రాయించి ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జి మంద పిచ్చయ్య మాదిగ, మాతంగి దావీదు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బ్రహ్మాజీరావు

స్వచ్ఛమైన గాలి కోసం పాటుపడాలి

ఏఎన్‌యు సైన్స్ విభాగాధిపతి బ్రహ్మాజీరావు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ప్రకృతిలో స్వచ్ఛమైన గాలి కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ విభాగాధిపతి ఆచార్య పి బ్రహ్మాజీరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాల ఆధ్వర్యంలో నీలి ఆకాశం కోసం అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవం సందర్భంగా 'స్వచ్ఛమైన గాలి కోసం అందరం' అంశంపై సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ఆచార్య పి. బ్రహ్మాజీరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాపితంగా చోటు చేసేకుంటున్న సాంకేతిక ప్రగతి పర్యావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్నారు. ప్రధానంగా ప్రకతిలో కీలకమైన గాలి నాణ్యత రోజురోజుకు దిగజారుతుందన్నారు. వాయు కాలుష్యం పెరుగుతుండటంతో మానవుల ఊపిరితిత్తుల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. కేవలం మానవులకే కాకుండా సమస్త జీవరాశి గాలి కాలుష్యంతో ప్రమాదంలో పడిందన్నారు. వాయు కాలుష్యాన్ని వీలైనంత వరకూ తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా వస్తున్న పరిస్థితులను విద్యార్థులు గమనిస్తూ ప్రకృతిలో జరిగే కాలుష్యాన్ని నివారించేందుకు పాటుపడాలని సూచించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి విజయవాడ రీజనల్ ఆఫీసర్ ఎస్ విజయసారధి మాట్లాడుతూ విద్యార్థులు కాలుష్య కారకాలను తెలుసుకోవాలన్నారు. కాలుష్యాన్ని నివారించేందుకు పాటుపడాలన్నారు. ముఖ్యంగా కాలుష్య నివారణకు సంబంధించి నూతన ఆవిష్కరణలు తీసుకురావాలన్నారు. కార్యక్రమానికి కళాశాల అధ్యక్షులు డాక్టర్ వి నారాయణరావు అధ్యక్షత వహించారు. విభాగాధిపతి సిహెచ్ నాగభూషణం, అధ్యాపకులు ఆర్ ఉదయ్‌కుమార్, ఏహెచ్‌డీ ప్రకాష్, జీ హేమలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సాయం అందిస్తున్న కోటేశ్వరరావు

విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : అవసరాలను గమనించి చేయూతనందిచడమే మానవత సేవా సంస్థ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర కన్వీ నర్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు.పాలిటెక్నిక్ చదువుకుంటున్న అప్పనవీడుకు చెందిన విద్యార్థి ఖాదర్వలీకి మానవత సేవా సంస్థ ఆర్థికసాయం అందజేశారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు చేతులమీదుగా ట్యూషన్ఫజు నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయాన్ని విద్యార్థికి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు, దయాల ప్రభాకర్ రావు,పాబోలు గణేష్ బాబు, జిల్లా సెక్రెటరీ వడ్డీ రాజేశ్వరరావు, నారగాని కొండలరావు, జన్యావుల సత్యనారాయణ కన్నెగంటి వెంకట సుబ్బారావు, గోళ్ల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక భారతీయ జీవిత భీమా 67 వారోత్సవాలను భాగంగా గుడివాడ పట్టణ స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో విద్యాలయ ఇంగ్లీషు మీడియం విద్యార్థిని మూడెడ్ల పూర్ణ శ్రీపునీత్ ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి సాధించడం అభినందనీయమని జిల్లా కన్సుమార్ ఫోరమ్ కోర్టు జడ్జి నందిపాటి పద్మారావు, గుడివాడ ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ ఎ.వి.వి సత్యనారాయణలు అన్నారు. గురువారం స్థానిక జీవిత బీమా కార్యాలయంలో విద్యార్థులను అభినందించే కార్యక్రమాని నిర్వహించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ విద్యాలయ విద్యార్థులు అత్యధిగా ప్రతిభా కనబరించి అధిక బహుమతులను అందుకోవడం గొప్ప విషయమన్నారు. విద్యాలయ విదార్థులు భవిష్యత్‌లో ఇంకెన్నో విజయలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్స్ బొప్పన వెంకట విజయభాస్కర్, శాంతి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలో విద్యను బోధిస్తూ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన వారిని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి జి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సత్కార సభలో ఘనంగా పూలమాలలో శాలువాలతో సత్కరించారు. చాగంటిపాడు ఎంపీయు పి పాఠశాల ఉపాధ్యాయురాలు జీ.హిమ కుమారి, గరికపర్రు ఎంపీ యుపిఎస్ పాఠశాల ఉపాధ్యాయిని ఎస్.బి.డి. మల్లేశ్వరి, కుమ్మమూరు ఎంపీపీ ఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు ఏ.కోటేశ్వరరావులను సత్కరించారు. జడ్పిటిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి, ఎంపీపీ ఈడుపుగంటి రాజామణి, ఎంపీడీవో స్వర్ణలత,ఎమ్మార్వో కుసుమ కుమారి వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీ టీసీలు వివిధ పాఠశాలల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయుల

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి వారు విద్యను అందిస్తున్న తీరును వివరించి అభినందించారు. ఎంఈఓ వెంకటేశ్వరరావు, సురేష్‌లు మండలంలో విద్యా విధానాన్ని ముందుకు నడిపిస్తున్న తీరును అభినందించారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక వేడుకలు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : బ్యాంక్ ఆఫ్ ఇండియా హనుమాన్ జంక్షన్ బ్రాంచ్ నందు 118 వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్క ఖాతాదారులకు బ్రాంచ్ మేనేజర్,ఇతర సిబ్బంది గులాబీలతో స్వాగతం పలికారు. అలాగే బ్రాంచ్ లో అత్యుత్తమ, విశిష్ట ఖాతాదా రులకు ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలను సూపర్ సీనియర్ సిటిజన్ ఓలేటి సీతారామస్వామి తో కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఖాతాదారులు హనుమాన్ జంక్షన్ లో బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ప్రశంసించారు.బ్రాంచ్ మేనేజర్ బి. నరేష్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు బ్రాంచ్ 120 కోట్లతో ముందుకు సాగిపోతున్న తరుణంలో ఈ సంవత్సరం 200 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు

.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఆకాష్, గాయత్రి, విద్యాబాల,ప్రవీణ్, అజయ్, రాము, గీత,దివ్య ,ఒకళాదేవి, పాల్గొన్నారు.ఖాతాదారులు శేరి నరసన్న పాలెం సర్పంచ్ అడపా అంజి బాబు,శంకర్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం

పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ను స్వతంత్రం జిల్లా పరిషత్ పాఠశాలలో కోడూరు మండల జడ్పిటిసి సభ్యులు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గురువారం, శుక్రవారం రెండు రోజులు పాటు ఈ గేమ్స్ సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి టివిఎం రామదాసు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శారీరిక మానసిక వికాసానికి ఈ క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 వి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఆలా వెంకటరమణ, మండల స్పోర్ట్స్ కన్వీనర్ ఎంఎస్ పెరుమాళ్ళు, పిడి .బిపిఎల్ ప్రసాద్, ఆర్ రామ్మోహనరావు, ఎంపీటీసీ తిమ్మన నాంచారయ్య, విశ్రాంతి ఉపాధ్యాయులు ఆలా రమేష్ పాల్గున్నారు.

కొనసాగిన ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఎంఈఐఎల్, ఎస్ఆర్ ఫౌండేషన్ల సహకారంతో డోకిపర్రు గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరం గురువారం రెండో రోజు కొనసాగింది. సుమారు డజను మంది వైద్యులు వివిధ రకాల పరీక్షలు రోగులకు నిర్వహించారు. అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వటంతో పాటు మందులు అందచేశారు. సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

వేడుకగా కృష్ణాష్టమి వేడుకలు : మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలో వేంచేసియున్న శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం కష్ణాష్టమిని పురస్కరించుకుని వేడుకలు వేడుకగా జరిగాయి. శ్రీకష్ణుడి వేష ధారణలో పిల్లలు అలరించారు. ఈ సందర్భంగా వెన్న దొంగ శ్రీకష్ణుడి వేషధారణ పోటీలు నిర్వహించారు. అత్యుత్తముగా

మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్లు

వేషధారణ చేసిన వారికి తొలి మూడు బహుమతులను ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ధర్మకర్త సుధారెడ్డి బహుమతులను అందచేశారు. సాయంత్రం ఉట్ల ఉత్సవం జరిగింది. గ్రామంలోని యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉట్టి కొట్టటంలో పోటీ పడ్డారు. శ్రీ కష్ణాష్టమిని పురస్కరించుకుని గురువారం ఉదయం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం నిర్వహించారు. శ్రీ కష్ణాష్టమిని పురస్కరించుకుని ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొని అనంతరం శ్రీ కష్ణుని దర్శించుకుంటే మనసులో ఉన్న కల్మషం అంటా పోయి మనస్సు ప్రశాంతంగా ఉంటుందని ఈ సందర్భంగా వేదం పండితులు వివరించారు.

నేడు స్కిల్ సెంటర్ ప్రారంభం : ఎంఈఐఎల్, ఎస్ఆర్‌ఫౌండేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న స్కిల్ సెంటర్ ను డోకిపర్రు గ్రామంలో శుక్రవారం సుధా రెడ్డి ప్రారంభించనున్నారు. డోకిపర్రు చుట్టుపక్కల గ్రామంలోని యువతకు ఇందులో వత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. ఇదిలా ఉండగా వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రసాదం తయారు చేసేందుకు ప్రత్యేకంగా నిర్మించిన పోటును కూడా సుధారెడ్డి ప్రారంభిస్తారు. శ్రావణ మాసం ను పురస్కరించుకుని చివరి శుక్రవారం నాడు సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించనున్నారు. వైద్య శిబిరం, శ్రీకష్ణాష్టమి, వరలక్ష్మి వ్రతం పురస్కరించుకుని దేవాలయంలో ఏర్పాటు చేసిన సాంస్కతిక ఉత్సవాలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

పనులకు శంకుస్థాపన చేస్తున్న అధికారులు

పిహెచ్‌సిలో వివిధ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి ఉంగుటూరు(గన్నవరం) : ఉంగుటూరు మండలం ఇందుపల్లి గ్రామములోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాల పనులకు గురువారం ఎంపీడీవో శేషగిరిరావు శంకుస్థాపన చేశారు. ఉంగుటూరు పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా అంచనా ఎనిమిది లక్షల రూపాయల విలువతో మంజూరు కాబడిన రోడ్ల నిర్మాణం ,మెరక, జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తామని శేషగిరిరావు చెప్పారు. గ్రామీణ ప్రజలకు వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు భవనాల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని, మండలానికి రెండు పీహెచ్‌సీలను అందుబాటులోకి తేవడమే కాకుండా ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరేసి డాక్టర్లు ఉంటారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి వెంట లక్ష్మి, ఎంపిటిసి సభ్యులు కె. వెంకట్రామయ్య, సచివాలయ కన్వీనర్లు సరోజినీ, గ్రామ పెద్దలు అట్లూరి శ్రీనివాసరావు, మండవ ప్రసాద్ పాల్గొనారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తరలించొద్దు

ప్రజాశక్తి-చల్లపల్లి : ఇరవై ఏళ్లుగా ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని వేరే ప్రాంతానికి తరలించ వద్దని బాలింతలు, గర్భిణీలు బుధవారం డిమాండ్ చేశారు కోరారు. చల్లపల్లి పార్వతమ్మ తోటలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ అధికారులు వేరొక చోటకు మార్చాలని అంగన్వాడీ కార్యకర్తపై ఒత్తిడి చేస్తున్నారని సెంటర్ పరిధిలోని తల్లిదండ్రులు ఆరోపించారు. ఇరవై ఏళ్ళుగా ఉన్న కేంద్రాన్ని మార్చాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఇరవై ఏళ్లుగా ఈ అంగన్వాడీ కేంద్రానికి ఐసీడీఎస్ అధికారులు పక్కా భవనం ఏర్పాటు చేయలేకపోయారన్నారని విమర్శించారు. పక్కనే సంత బజారులో స్థలం కేటాయించినా ఇప్పటివరకు నూతన అంగన్వాడీ కేంద్రం నిర్మించలేదని తెలిపారు. తామందరికీ అందుబాటులో ఉన్న ఈ కేంద్రం వేరొక ప్రాంతానికి మార్చవద్దని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ అధికారులకు ఏమైనా సమస్య ఉంటే సెంటర్ పరిధిలోని తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి తమ అభిప్రాయాలూ వినాలని కోరారు. నూతన భవనం నిర్మించే వరకూ పార్వతమ్మ తోట అంగన్వాడీ కేంద్రం ఇక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

సౌకర్యవంతమైన సేవలు అందించటమే లక్ష్యం :సిడిపిఒ

గర్భిణీలు, బాలింతలకు సౌకర్యవంతమైన సేవలు అందించడమే లక్ష్యమని హాయ్ సిడిఎస్ సిపిడిఓ పి భానుమతి తెలిపారు. గురువారం పార్వతమ్మ తోటలో అంగన్వాడి కేంద్రాన్ని ఆమె సందర్శించి గర్భిణీలు,బాలింతలతో సమావేశం నిర్వహించారు. పార్వతమ్మ తోట అంగన్వాడీ కేంద్రం అసౌకర్యంగా ఉన్న నేపథ్యంలోనే సౌకర్యవంతమైన అద్దె భవనానికి మార్చుతున్నట్లు భానుమతి తెలిపారు.ప్రస్తుతం ఉన్న అంగన్వాడీలో తగిన సౌకర్యాలు లేవని, కేంద్రానికి వచ్చే గర్భిణీలు, బాలింతలు, పిల్లల సౌకర్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఆదిలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు

చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం): ఆద మరిస్తే ప్రాణం పోయినట్టే. ఇది నాగవరప్పాడు రైస్ మిల్ ఏరియాలో పరిస్థితి. ఇది ఉత్తేగలు చేతికి అందే ఎత్తులో వేలాడుతున్నాయి. పొలంలోకి వెళ్లాలంటే కూలీలు రైతులు భయాందోళన గురవుతున్నారు. ఉంగుటూరు మండలం నాగువరపాడు రైస్ మిల్లు వద్ద గల ట్రాన్సారం వద్ద నుండి నాగవరపాడు మెయిన్ రోడ్డు వద్ద గల చిన్న ట్రాన్సర్ ఆయన దగ్గర వెళ్ళు విద్యుత్తులైన తీగలు చేతికి అందే పరిస్థితిలో ఉన్నాయి. విద్యుత్ అధికారులు పట్టించుకోవాలని రైతులు కోరుతున్నారు.

కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

దుర్గమ్మను దర్శించుకున్న సుప్రీం న్యాయమూర్తి మిశ్రా దంపతులు

ప్రజాశక్తి - వన్‌టౌన్, విజయవాడ అర్బన్ : విజయవాడ కనక దుర్గమ్మను గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దంపతులు దర్శించుకున్నారు. కలెక్టర్ ఢిల్లీ రావు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఇఒ డి.భ్రమరాంబ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వీరితోపాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎవి శేషసాయి దంపతులు, జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు విచ్చేశారు. వీరంతా దుర్గమ్మ పంచ హారతుల సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ చైర్మన్, ఇఒ ప్రసాదాలు, దుర్గమ్మ శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అదితి సింగ్, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు చింతా సింహాచలం, నంబూరి రవి పాల్గొన్నారు.

జస్టిస్ మిశ్రాకు ఘన స్వాగతం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు గురువారం నగరంలోని నోవోటెల్ హోటల్లో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఘన స్వాగతం పలికారు. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తిరుపతి, శ్రీశైలం పర్యటన నిమిత్తం హైదరాబాద్ నుండి విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన విజయవాడలోని నోవోటెల్ హోటల్‌కు చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు పుష్పగుచ్ఛం అందజేశారు.

జస్టిస్ మిశ్రా దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఒ భ్రమరాంబ, చైర్మన్ రాంబాబు, పక్కన కలెక్టర్ ఢిల్లీరావు

రెండో దశ భూ రీ సర్వే వేగవంతం : కలెక్టర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ

భూ హక్కు పత్రాల పంపిణీ పెండింగ్ లేకుండా పూర్తి చేయడంతోపాటు రెండవ దశ రీ సర్వే ప్రక్రియ వేగవంతం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న రీసర్వే పనుల ప్రగతిని గురువారం సిసిఎల్ఎ ప్రధాన కార్యాలయం నుండి అన్ని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సర్వే అధికారులతో భూ హక్కు పత్రాల పంపిణీ, రీసర్వే, సరిహద్దు రాళ్ల నాటే ప్రక్రియ, గ్రౌండ్ ట్రూతింగ్ తదితర అంశాలపై సిసిఎల్ఎ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో కన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ రెండవ దశ రీసర్వేలో భాగంగా జిల్లాలోని 59 గ్రామాలలో ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. నందిగామ డివిజన్‌లో 48 గ్రామాలు, విజయవాడ డివిజన్‌లో 11 గ్రామాలలో ఈ ప్రక్రియ జరుగుతోందన్నారు. రీ సర్వేలో గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, విలేజ్ సర్వేయర్ డేటా ఎంట్రీ, తహశీల్దార్ లాగిన్, 13వ నోటిఫికేషన్ జారీ తదితర ప్రక్రియను పూర్తి చేసినట్లు చెప్పారు. ఈనెల 30వ తేదీలోగా సర్వే, సరిహద్దు రాళ్ల నాటే ప్రక్రియను పూర్తి చేస్తామని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, GOGADA SRI VENKATA SAI SESHENK, (Old Name), Resident of D.No. 76-10/2-4, Gandhi Bomma Street, Bhavanipuram, Vijayawada-520012. My Name has been changed to GOGADA SRI VENKATA SAI SESHANK (New Name). Here after my name is known as GOGADA SRI VENKATA SAI SESHANK.

CHANGE OF NAME

I, SWARNA LAKSHMI THELAPOLU, (Old Name), Resident of D.No. 1-3/24-4/13, Vaddi Vari Street, Cement Road, Vidyadharapuram, Vijayawada-520012. My Name has been changed to TELAPOLU SWARNA LAKSHMI (New Name). Here after my name is known as TELAPOLU SWARNA LAKSHMI.

సర్టిఫికేట్ పోయినది

ఎన్టీఆర్ జిల్లా, చందర్లపాడు మండలం, తుర్లపాడు గ్రామ కాపురస్తులు బలగాని శ్రీనివాసరావు తండ్రి వీరయ్య చెందిన ఇంటర్మీడియట్ లాంగ్ మెమో సర్టిఫికేట్ పోయినది. మెమో సర్టిఫికేట్ నెం. 1707146001. జిరాక్స్ నిమిత్తము నందిగామ గాంధీ సెంటర్ కు బైక్ పై వస్తుండగా మార్గ మధ్య లో మెమో సర్టిఫికేట్ పోయినది. సదరు సర్టిఫికేట్ దొరికిన వారు సెల్ నెం. 7386665655కు ఫోన్ చేసి అందజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

CHANGE OF NAME

I, YENIGALLA NAGABHUSHANA RAO, (Old Name), Resident of D.No. 48-19-7D, Flat No.302, Gandhi Towers, Sri Rama Chandra Nagar, Vijayawada-520008. My Name has been changed to VENIGALLA NAGABHUSHANA RAO (New Name). Here after my name is known as VENIGALLA NAGABHUSHANA RAO.

మహారాజశ్రీ తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్ నెం. 1/2019

బిట్వీన్:
తొర్లపాటి దిలీప్ కుమార్ సన్నాఫ్ ఆంజనేయులు వయస్సు 11 సంవత్సరాలు, మైనర్ అయినందున గార్డెన్ తల్లి సావిత్రి ...... వాది
అండ్
తొర్లపాటి వీరరాఘవయ్య డైడ్ మరియు ఆరుగురు. ... ప్రతివాదులు

నోటీసు

6వ ప్రతివాది : కారుమంచి వెంకటరమణ సన్నాఫ్ మధుసూదనరావు, హిందూ, వయసు 45 సంవత్సరాలు, చింతలపాడు గ్రామం, తిరువూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్

పై నెంబరు దావాలో వాది మీపై దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో నీకేమైనా ఆక్షేపణలు ఉన్నయెడల నీవు మహారాజశ్రీ తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి వారి కోర్టులో ది. 21-09 -2023వ తేదీన ఉదయం 10:30 గంటలకు స్వయంగా గానీ లేదా నీవకీలు ద్వారా గాని హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని చో నీ పరోక్షమున యందు దావాను విమర్శించి తీర్మా నించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

చింతల వెంకటరెడ్డి
వాది తరుపు న్యాయవాది
తిరువూరు
తిరువూరు.
ది.07-09-2023
సెల్: 9440764148

మొదటిపేజీ తరువాయి

పర్యావరణంపై ప్రజల్లో చైతన్యం అవసరం

శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, వివిఎంసి మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ దేవినేని అవినాష్ మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్, అడవులలో చెట్లు నరికివేత, పచ్చదనం తొలగించడం వల్ల గాలి కాలుష్యం, ప్లాస్టిక్ వాడకం వంటివి ప్రధాన పర్యావరణానికి సమస్యలుగా మారాయని, వీటి నివారణకు కార్యాచరణ కోసం ఏటా 143 దేశాలు పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగస్వాములయ్యేలవుతున్నాయని అన్నారు. వాతావరణంలో వచ్చే మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, భూకంపాలు, సునామీలు, అగ్ని పర్వతాలు బద్దలవడం, ఇండస్ట్రియల్ పొల్యూషన్ వల్ల మానవాళిపై పెను ప్రభావం పడుతోందని, ప్రజలంతా బాధ్యతగా భావించి తమ పరిధిలో కాలుష్య నియంత్రణ చర్యలు పాటించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణపై పౌరులంతా బాధ్యతగా మెలిగి భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని ఆకాంక్షించారు. అనంతరం ఈనెల 5న వివిధ పాఠశాలల విద్యార్థులతో ఐజిఎంసి స్టేడియంలో విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీ శైలజా రెడ్డి, 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్, అడిషినల్ కమిషనర్ (జనరల్) కె.శకుంతల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కెవి.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.పి.రత్నావళి, ఎస్టేట్ అధికారి టి.శ్రీనివాస్, (డిప్యూటీ సిటీ ప్లానర్ ప్లానింగ్) జుబిన్ శిరన్ రాయ్ పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈక్రాప్ నమోదు పూర్తి

ధాన్యం కొనుగోలు ప్రక్రియకు మిల్లర్లు తూట్లు పొడిచి ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా చేస్తే సహించేది లేదన్నారు. అవసరమైతే కేసులు నమోదు చేయాలని కలెక్టరుకు సూచించారు. జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహాలు, టిట్కో గృహాల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని అన్నారు. జగనన్న ఇచ్చిన హామీలను నాలుగేళ్లలోనే అమలుచేసి దేశంలోనే మొదటి ఐదు రాష్ట్రాల్లో అగ్రగామిగా రాష్ట్రాన్ని నిలబెట్టారని అన్నారు. సాగునీటి కాల్వల నిర్వహణ పనులకు ఫిబ్రవరిలోనే టెండర్లు పిలిచి ఏప్రిల్, మేల్లోనే పనులు పూర్తి చేసేలా కార్యాచరణ అమలు చేయాలన్నారు. ఎంఎల్ఎ కొలుసు పార్థసారథి నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. గృహ నిర్మాణ ప్రగతి చాలా బాగుందని, అయితే మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని సూచించారు. ఇంకా ప్రారంభంకాని గృహ నిర్మాణాలపై దృష్టి సారించాలని కోరారు. సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పనితీరు సమీక్షించాలన్నారు. ఉయ్యూరులోని పంచాయతీరాజ్ డిఇ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ కార్యాలయ భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కంకిపాడు మండలం కుందేరులో బ్రిడ్జి నిర్మించి ఐదేళ్ల గడిచినా ఇంకా వినియోగంలోకి రాలేదన్నారు. తెన్నేరులో కూలిపోయిన బ్రిడ్జి మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అన్నారు. ఉయ్యూరు పకీర్ చావిడి ప్రాంతంలో వక్ఫ్ భూముల రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించాలని, మద్దూరులో అర్హులైన వారికి లంక భూముల పట్టాలు ఇప్పించాలని కోరారు. వైఎస్ఆర్ తాడిగడప మున్సిపల్ పరిధిలో ప్రత్యేక పోలీస్ స్టేషన్ మంజూరు చేయాలని, పన్నుల వసూళ్లకు సిబ్బందిని పెంచాలని, మున్సిపల్ కార్యాలయ భవనానికి, డంపింగ్ యార్డ్‌కు అవసరమైన స్థలాలు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. పెనమలూరులో పిహెచ్‌సి ఏర్పాటుకు కేంద్రం నిధులు మంజూరు చేసిందని, దీనికి స్థల పరిశీలన చేయాలని అన్నారు. సమీక్ష అనంతరం కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ శాసనసభ్యులు ప్రస్తావించిన సమస్యలు, అంశాలను పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకునేందుకు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో పామర్రు ఎంఎల్ఎ కైలే అనిల్ కుమార్, కెడిసిసిబి చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, కంకిపాడు ఎంపిపి రాజ్యలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యులు బాకీ బాబు, డిఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, జడ్‌పి సిఇఒ జ్యోతి బసు, వివిధ శాఖల అధికారులు, నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం, దబ్బాకుపల్లిగ్రామానికి చెందిన రైతు కొత్తపల్లి శివన్నారాయణ కుమారుడు కొత్తపల్లి నవీన్ కుమార్ డాక్యుమెంట్ నెంబర్1839/1999 దబ్బాకుపల్లి నుండి వత్సవాయి బైకుపై వెళుతుండగా మార్గమధ్యలో డాక్యుమెంట్ పోయింది. జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్154/1లో ఒక ఎకరం,మరియు సర్వే నంబర్ 154/2లో ఒక ఎకరం భూమిమొత్తం రెండు ఎకరాలు భూమి కలదు. డాక్యుమెంట్ దొరికిన వారు ఈ క్రింది నెంబర్కు తెచ్చి ఇవ్వగలరు.

ఇట్లు,
కొత్తపల్లి నవీన్ కుమార్,
తండ్రి కొత్తపల్లి శివన్నారాయణ లేటు,
దబ్బాకుపల్లి గ్రామం, వత్సవాయి మండలం,
ఎన్టీఆర్ జిల్లా, సెల్ నెంబర్6302782511.

మహారాజశ్రీ 6వ అదనపు సీనియర్ సివిల్‌జడ్జి విజయవాడ వారి కోర్టులో

I.A. No. 538/2023 in O.S. No. 789/2017

బిట్వీన్ :
నడకుదిటి హర్షవర్ధన్ ... పిటీషనర్ / వాది
మరియు
1) నడకుదిటి శ్రీనివాసరావు
2) బొమ్మిడి వెంకటేశ్వరరావు (డైడ్)
3) చింతా నాంచారయ్య
4) బొమ్మిడి భాగ్యలక్ష్మి
5) బొమ్మిడి గణేష్
6) బొమ్మిడి అయ్యప్పస్వామి ...రెస్పాండెంట్స్
టు
1) బొమ్మిడి భాగ్యలక్ష్మి భర్త (లేటు) బొమ్మిడి వెంకటేశ్వరరావు, డోర్ నెం. 28-578, జలాల్‌పేట, మచిలీపట్నం (రెస్పాండెంట్ నెం.4)
2) బొమ్మిడి గణేష్ తండ్రి (లేటు) బొమ్మిడి వెంకటేశ్వరరావు, డోర్ నెం. 1/1089-43, రాఘవరావు కాలనీ, శారదానగర్, మచిలీపట్నం. (రెస్పాండెంట్ నెం.5)
3) బొమ్మిడి అయ్యప్పస్వామి, తండ్రి (లేటు) బొమ్మిడి వెంకటేశ్వరరావు, డోర్ నెం. 636/3, 3వ ఫ్లోర్, సువర్ణ రెసిడెన్సీ, పరాస్‌పేట, మచిలీపట్నం (రెస్పాండెంట్ నెం.6)

పై పిటీషన్‌లో రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారు సమన్లు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టువారి యెదుట మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా 21-09-2023వ అయియున్నది. కావున మీరు పై తేదీన ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలున్న తెలుపుకోవలెను. లేనియెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

//శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం//
ఆర్డరు తేది : 14-7-2023
వాయిదాతేది: 21-09-2023

పెన్నేరు దుర్గా సత్యనారాయణ
పిటీషనర్ తరుపు న్యాయవాది,
గాంధీనగర్, విజయవాడ.

మహారాజశ్రీ 6వ అదనపు సీనియర్ సివిల్‌జడ్జి విజయవాడ వారి కోర్టులో

I.A. No. 539/2023 in O.S. No. 789/2017

బిట్వీన్ :
నడకుదిటి హర్షవర్ధన్ ... పిటీషనర్ / వాది
మరియు
1) నడకుదిటి శ్రీనివాసరావు
2) బొమ్మిడి వెంకటేశ్వరరావు (డైడ్)
3) చింతా నాంచారయ్య
4) బొమ్మిడి భాగ్యలక్ష్మి
5) బొమ్మిడి గణేష్
6) బొమ్మిడి అయ్యప్పస్వామి ...రెస్పాండెంట్స్
టు
1) బొమ్మిడి భాగ్యలక్ష్మి భర్త (లేటు) బొమ్మిడి వెంకటేశ్వరరావు, డోర్ నెం. 28-578, జలాల్‌పేట, మచిలీపట్నం (రెస్పాండెంట్ నెం.4)
2) బొమ్మిడి గణేష్ తండ్రి (లేటు) బొమ్మిడి వెంకటేశ్వరరావు, డోర్ నెం. 1/1089-43, రాఘవరావు కాలనీ, శారదానగర్, మచిలీపట్నం. (రెస్పాండెంట్ నెం.5)
3) బొమ్మిడి అయ్యప్పస్వామి, తండ్రి (లేటు) బొమ్మిడి వెంకటేశ్వరరావు, డోర్ నెం. 636/3, 3వ ఫ్లోర్, సువర్ణ రెసిడెన్సీ, పరాస్‌పేట, మచిలీపట్నం (రెస్పాండెంట్ నెం.6)

పై పిటీషన్‌లో రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారు సమన్లు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టువారి యెదుట మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా 21-09-2023వ అయియున్నది. కావున మీరు పై తేదీన ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలున్న తెలుపుకోవలెను. లేనియెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

//శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం//
ఆర్డరు తేది : 14-7-2023
వాయిదాతేది: 21-09-2023

పెన్నేరు దుర్గా సత్యనారాయణ
పిటీషనర్ తరుపు న్యాయవాది,
గాంధీనగర్, విజయవాడ.

మహారాజశ్రీ 6వ అదనపు సీనియర్ సివిల్‌జడ్జి విజయవాడ వారి కోర్టులో

I.A. No. 540/2023 in O.S. No. 789/2017

బిట్వీన్ :
నడకుదిటి హర్షవర్ధన్ ... పిటీషనర్ / వాది
మరియు
1) నడకుదిటి శ్రీనివాసరావు
2) బొమ్మిడి వెంకటేశ్వరరావు (డైడ్)
3) చింతా నాంచారయ్య
4) బొమ్మిడి భాగ్యలక్ష్మి
5) బొమ్మిడి గణేష్
6) బొమ్మిడి అయ్యప్పస్వామి ...రెస్పాండెంట్స్
టు
1) బొమ్మిడి భాగ్యలక్ష్మి భర్త (లేటు) బొమ్మిడి వెంకటేశ్వరరావు, డోర్ నెం. 28-578, జలాల్‌పేట, మచిలీపట్నం (రెస్పాండెంట్ నెం.4)
2) బొమ్మిడి గణేష్ తండ్రి (లేటు) బొమ్మిడి వెంకటేశ్వరరావు, డోర్ నెం. 1/1089-43, రాఘవరావు కాలనీ, శారదానగర్, మచిలీపట్నం. (రెస్పాండెంట్ నెం.5)
3) బొమ్మిడి అయ్యప్పస్వామి, తండ్రి (లేటు) బొమ్మిడి వెంకటేశ్వరరావు, డోర్ నెం. 636/3, 3వ ఫ్లోర్, సువర్ణ రెసిడెన్సీ, పరాస్‌పేట, మచిలీపట్నం (రెస్పాండెంట్ నెం.6)

పై పిటీషన్‌లో రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారు సమన్లు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై కోర్టువారి యెదుట మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా 21-09-2023వ అయియున్నది. కావున మీరు పై తేదీన ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, న్యాయవాది గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలున్న తెలుపుకోవలెను. లేనియెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

//శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం//
ఆర్డరు తేది : 14-7-2023
వాయిదాతేది: 21-09-2023

పెన్నేరు దుర్గా సత్యనారాయణ
పిటీషనర్ తరుపు న్యాయవాది,
గాంధీనగర్, విజయవాడ.

పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : అంగన్వాడీ కేంద్రాల పిల్లల్లో సరైన ఎదుగుదల ఉండే విధంగా ప్రత్యేక దష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వెలగపూడి సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సుస్థిర అభివద్ధి లక్ష్యాలు, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, పాఠశాల విద్య, గ్రామ వార్డు సచివాలయాలు స్పందన అర్జీల పరిష్కారం, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్ నుండి పాల్గొన్న అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో మంచి పోషకాహారం అందించి పిల్లల్లో సరైన ఎదుగుదల ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం పోషకాహారం అందిస్తున్న పిల్లల్లో ఎదుగుదల లేకపోవడం సరైంది కాదన్నారు. ఒక నిర్ణీత సమయం నిర్ధారించుకుని ఎదుగుదలను గమనించాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హైరిస్కు కేసులు మినహా సాధారణ ప్రసవాలు తప్పనిసరిగా జరిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా కీటక జనిత వ్యాధుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కుటుంబ వైద్యుల పరీక్షల నిర్వహణ సజావుగా జరిగేలా చూడాలన్నారు.పాఠశాల విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా ప్రత్యేక దష్టి సారించాలన్నారు. మాతా శిశు మరణాలు తగ్గించేందుకు కార్యాచరణ ప్రణాళికను అమలుపరచాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ సేవలు మరింత పెంచాలన్నారు.ఐదు నుండి 18 సంవత్సరాల పిల్లలందరూ పాఠశాల లేదా కళాశాలలో చేరి ఉండాలని ప్రతి ఒక్కరిని తప్పని సరిగా విద్యాసంస్థల్లో చేర్పించాలన్నారు. మనబడి నాడు నేడు రెండవ దశ పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. విద్యాశాఖ అధికారులు, గ్రామ వార్డు సచివాలయాల విద్యా కార్యదర్శులు పాఠశాలలను వారానికో సారి సందర్శించి అక్కడ నిర్వహణ ఏర్పాట్లు పర్యవేక్షిం చాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా నుంచి డిఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ పి డి సువర్ణ, డీఈవో తహరా సుల్తానా, జెడ్ పి సీఈవో జ్యోతిబసు, డిపిఓ నాగేశ్వర్ నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

వేకనూరులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని వేకనూరు గ్రామంలో మహాశక్తి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు బండే నాగ వెంకట కనకదుర్గ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో లోని సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకనూరు గ్రామాన్ని అభివద్ధి చేసింది మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలన పెరిగిన నిత్యవసర ధరలు ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, తెలుగు మహిళలు మాదివాడ రాజి, పైడి పాముల స్వప్న, బావిశెట్టి కనకదుర్గ యా సం లంకమ్మ, విశ్వనాథపల్లి పాప, మట్ట నారాయణమ్మ, సనక అన్నపూర్ణమ్మ పంచాయతీ ఉప సర్పంచ్ తుంగల మురళి, గ్రామ పార్టీ నాయకులు మాదివాడ రత్నారావు, మాదివాడ కుటుంబరావు, గుడివాక నరహరి పార్టీ నాయకులు షేక్ బాబావాలి, మాదివాడ బద్రి నారాయణ, గాజుల శ్రీనివాసరావు, నిజాంపట్నం మురళి, దోదావరి కొండలు, వరికుటి పార్ధసారథి, మాదివాడ బాబురావు, వరి కోటి వెంకటేశ్వరరావు, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, లుక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో అద్దెల దరువు

ప్రజాశక్తి-గన్నవరం : అమరావతి పరిసర ప్రాంతాలలో భూముల ధరలతోబాటు ఇళ్ళ అద్దెలు కూడా భారీగా పెరుగు తున్నాయి. గుంటూరు తెనాలి ప్రాంతాలలో భూముల రెట్లు – ఊపందుకోగా, అంతర్జా తీయ విమానాశ్రయం ఉన్న గన్నవరం పట్టణంలో అపార్ట్మెంట్ల అద్దెలు ఆకాశాన్ని అంటుకుంటు న్నాయి. ఇళ్ళ జమానులు ఈ కొత్త సంవత్సరం నుంచి డబుల్ బెడ్ రూమ్ ఇంటికి రెండు వేల వరకూ అద్దె పెంచాలని ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. గత మూడేళ్ళ కాలంగా అమరావతి నుంచి రాజధానిని తరలించేందుకు ప్రస్తుత ప్రభుత్వం ప్రయత్నాలు. ప్రారంభించటంతో భూముల ధరలతో బాటు ఇళ్ళ అద్దెలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. రాజధాని మార్పును తప్పు బడుతూ, రాష్ట్రానికి ఒకటే రాజధాని ఉండాలనీ, ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజధాని మార్పు సహేతుకం కాదనీ, రాజధాని నిర్మాణం కోసం తమ భూముల్ని అందించిన అమరావతి రైతులు చేస్తున్న ఆందోళనకు వైసీపీ మినహా మిగిలిన అన్ని పార్టీలు గళం కలపడం, దానికి తోడు హైకోర్టు మొట్టికాయలు వేయడంతో రాజధాని తరలింపు ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. రాజధాని రైతులతో సీఆర్డీఏ చేసుకున్న ఒప్పందాన్ని విస్మరించి రాజధానిని తరలించేందుకు వీలు కుదరదని హైకోర్టు స్పష్టం చేయడంతో వైకాపా ప్రభుత్వం ముందుకు వెళ్ళలేక, వెనక్కి తగ్గలేక సంకటస్థితిలో పడిపోయింది. రాజధాని తరలింపు ప్రక్రియ అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు నీరుగారిపోవటంతో స్తబ్దుగా ఉన్న భూముల ధరలకు డిమాండు పెరిగింది. రాబోయే రోజుల్లా వచ్చేది తమ ప్రభుత్వమే నంటూ టీడీపీ అనుకూలవర్గ ప్రచారాన్ని విశ్వసించిన ప్రజలు ఎపీకి పెద్దఎత్తున తరలివస్తున్న నేపథ్యంలో ఇక్కడి భూముల ధరలతో బాటు ఇళ్ళ అద్దెలు సైతం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీప ప్రాంతాలలో ఇళ్ళు, అపార్టుమెంట్లు కొనేందుకు పలువురు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ప్రయివేటు విద్యా సంస్థలు, కళాశాలలతో బాటు పాలిటెక్నిక్, ప్రయివేటి ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీ, ప్రభుత్వ టర్నరీ కాలేజీ, ఉపాధి అవకాశాలను పెంచే విధంగా హైదరాబాద్ హైటెక్ టవర్స్ రీతిలో ఏపీ ఐటీ హబ్ గా ప్రాముఖ్యత సంతరించుకున్న ప్రఖ్యాత మేధా టవర్స్, హెచ్ సీ ఎల్, షుగర్ ఫ్యాక్టరీ, బేకన్ ఫ్యాక్టరీ, షాపింగ్ మాల్స్, ఆధ్యాత్మిక కేంద్రాలు– ఇలా దాదాపు అన్ని రకాల ఆధునిక సౌకర్యాలతో బాటు రైలు, బస్సు, విమాన ప్రయాణాలకు అనువుగా ఉండే గన్నవరం ప్రాంతం అందరినీ ఆకర్షిస్తోంది. నిన్నటి దాకా పదివేలలో వచ్చే టూ బెడ్ రూమ్ ఫ్లాటు నేడు 12 నుంచి 15 వేల దాకా అద్దె పలుకుతోంది. నిన్నటిదా 50 – 60 లక్షలలో వచ్చే టూ బెడ్ రూమ్ ఫ్లాటు నేడు మరో అయిదారు లక్షల నుంచి 10 లక్షల వరకూ ధర పలుకుతోందని తెలుస్తోంది. రోజురోజుకూ డిమాండ్ పెరుగుతుండటంతో ఈ ప్రాంతంలో కొత్త ఇళ్ళ, అపార్టుమెంట్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి.

గృహప్రవేశాలు చేస్తున్న లబ్ధిదారులు

పలుచోట్ల కృష్ణాష్టమి వేడుకలు

అవనిగడ్డలో...

మొవ్వలో...

ప్రజాశక్తి-అవనిగడ్డ : కృష్ణాష్టమి వేడుకలు అవనిగడ్డలో వైభవంగా నిర్వహించారు. గురువారం సబ్ కోర్ట్ ఆవరణలోని కృష్ణ ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ విజయ కళ్యాణి ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఐ గోపి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సనక రఘురాం ప్రసాద్, ఏపీపీ చిట్టిపోలు ప్రసాద్, నీలకంఠం వెంకటేశ్వరరావు, తిమ్మన సుబ్బారావు, వడ్డీ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గీత మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో రుక్మిణి కళ్యాణం నిర్వహించారు గీతా మందిరం ఆలయ కమిటీ చైర్మన్ హరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పరుచూరి దుర్గాప్రసాద్ ఝాన్సీ వాణి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక స్వాములు పవన్ కుమార్ నరసింహమూర్తి అప్పలాచార్యులు మంత్రపుష్పములు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు 500 మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకష్ణుని వేషాధారణలో అలరించారు. క్రాంతి కళాశాలల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో విద్యార్థులు ఉట్టి కొట్టి కనుల పండగ గా కార్యక్రమాన్ని నిర్వహించారు. **ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం పట్టణంలో కష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి యువ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా ఉల్లాసంగా జరిపారు. రాంబాబు, మరి కొంతమంది యువకులు పాల్గొని సందడి చేశారు. గురువారం యాదవుల పేట రామాలయం వద్ద పెద్ద ఎత్తున కష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. తీన్మార్ డప్పులతో సందడి చేశారు. **ప్రజాశక్తి – మొవ్వ :** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళాపీఠం లో శ్రీ కష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదాంతం రామలింగ శాస్త్రి , అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇదే విధంగా కూచిపూడి లోని శ్రీ వేణుగోపాల స్వామి మందిరం వద్ద కష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో పిల్లలు ఆనందో త్సాహలతో పాల్గొని ఉట్టి కొట్టి సందడి చేశారు. ఇదే విధంగా మండలంలో పలుచోట్ల కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు వెనిగండ్ల రాము

గుడివాడ అభివృద్ధిని మరిచిన కొడాలి

- టిడిపి నాయకులు వెనిగండ్ల రాము

ప్రజాశక్తి – గుడివాడ : మాజీ మంత్రి కొడాలి నాని కృష్ణాష్టమి రోజు పొద్దున్నే గంజాయి తాగి పిచ్చివాగుడు వాగుతున్నాడని తెలుగుదేశం పార్టీ నాయకులు వెనిగండ్ల రాము అన్నారు. గురువారం సాయంత్రం వెనిగండ్ల కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఐటీ, ఇన్కమ్ టాక్స్, ఈడీకి బ్రాండ్ అంబాసిడర్ జగన్ అని చిన్న పిల్లోడికి కూడా తెలుసు కానీ మన గంజాయి మంత్రికి తెలియట్లేదన్నారు. బినామీ ఖాతాలలో ఉన్న 49 కోట్లు సీజ్ చేశాక ఎక్కువగా ఇన్కమ్ టాక్స్ ఆఫీసుకి తిరుగుతున్న వ్యక్తులకి ఇన్కమ్ టాక్స్ ఈడి గురించి చాలా అద్భుతంగా తెలుస్తుందని, అందుకనే ఇన్కమ్ టాక్స్ఈడి గురించి మాట్లాడుతున్నారన్నారు. గత పది సంవత్సరాలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డి, విజయసాయిరెడ్డి, గంజాయి మంత్రి వీళ్లంతా న్యాయవాదులు న్యాయ నిపుణుల మీద ఖర్చుపెట్టిన డబ్బులతో కొన్ని జిల్లాలను అద్భుతంగా అభివద్ధి చేయొచ్చన్నారు. మన గుడివాడలో మంత్రి ఇంటి ముందు రోడ్డు జగన్మోహన్ రెడ్డి ఒక్క కోర్టు వాయిదా ఫీజుతో అద్భుతంగా వేయొచ్చన్నారు. ఎనిమిదో తరగతి చదివిన ఎమ్మెల్యే టర్నోవర్లు ఇన్కమ్ టాక్స్ లు గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. 10 వేల కోట్లు అని పిచ్చివాగుడు వాగుతున్న ఎమ్మెల్యేకి ముందుగా హెరిటేజ్ టర్నోవర్ రూ. 2600 కోట్లు అని తెలుసుకోవాలన్నారు. రూ.2600 కోట్లుతో హెరిటేజ్ దేశవ్యాప్తంగా ఉందని, హెరిటేజ్ రూ.2600 కోట్లు టర్నోవర్ సాధించటానికి 30 సంవత్సరాలు పట్టిందని తెలిపారు. అవినీతితో పుట్టి పెరిగిన సాక్షి , భారతి సిమెంట్ టర్నోవర్ ఎంత ? అది సాధించడానికి ఎన్ని సంవత్సరాలు పట్టిందో ప్రజలకు తెలియజేస్తే బాగుంటుందన్నారు. ఇంతకీ బినామీ ఖాతాలలో 49 కోట్లు రిలీజ్ అయి మళ్ళీ అకౌంట్ లోకి వచ్చాయా ఇంకా ఇన్కమ్ టాక్స్ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నారా అది కూడా ప్రజలకు తెలియజేయాలన్నారు. గుడివాడ నియోజకవర్గ అభివద్ధి మర్చిపోయిన ఎమ్మెల్యే కొడాలి నాని, బూతులు మాట్లాడడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పలువురు పాల్గొన్నారు.

కూడేరులో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-పమిడిముక్కల : పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం వైసిపితోనే సాధ్యమని పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని కూడేరు గ్రామంలో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే వచ్చాయన్నారు. కూడేరులో నాడు నేడు ద్వారా పాఠశాల అభివృద్ధి జరిగిందని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు వైయస్సార్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ రాజ్యలక్ష్మి, కూడేరు గ్రామ సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు వేర్ల ఆదిశేషు, వైయస్సార్ పార్టీ నాయకులు కొనతం రాధా రమేష్, ఏనుగ మస్తాన్రావు, వీరంకి చిరంజీవి, గొరిక్కపూడి బుజ్జి, జయరాజు స్థానిక ఏఎన్ఎం శివకుమారి పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలను పరిష్కరించండి

ఎస్ఎఫ్ఐ 'సంఘర్షణ సైకిల్ యాత్ర' ప్రారంభంలో వక్తలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఎన్టీఆర్ జిల్లా విద్యా రంగ అభివృద్ధికి ఎస్ఎఫ్ఐ సంఘర్షణ సైకిల్‌యాత్ర చేపట్టిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎస్.సోమేశ్వరరావు తెలిపారు. పట్టణంలో ఎస్ఎఫ్ఐ సంఘర్షణ సైకిల్ యాత్రను గురువారం ఐద్వా జిల్లా నాయకురాలు సోమోజు నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఎస్‌టి గురుకుల పాఠశాల, బాలికల జిల్లా పరిషత్ పాఠశాల, చిల్లకల్లు, గౌరవరం గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘర్షణ సైకిల్ యాత్ర సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, సోమేశ్వరరావు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ సంఘర్షణ సైకిల్ యాత్రలో భాగంగా జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో పది రోజుల పాటు పర్యటించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్లో సమస్యలు తెలుసుకుని ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ నెల 16వ తేదీన విజయవాడలో యాత్ర ముగుస్తుందన్నారు. జిల్లాలో సంక్షేమ హాస్టళ్లకు సొంత బిల్డింగులు నిర్మించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని, పెండింగ్లో ఉన్న కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని, కొత్తగా మంజూరు చేసిన జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని, డిగ్రీలో తీసుకొచ్చిన హానర్స్, మేజర్ - మైనర్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని, జిల్లాలో గ్రామాలకు వెళ్లే బడి బస్సుల సంఖ్య పెంచాలని, జిల్లాలో ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని, పిజిలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని, విద్యా దీవెన అమలు చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి గోపి నాయక్, ఉపాధ్యక్షులు కుమార్ నాయక్, మన్మథ, నాయకులు కుమారస్వామి, మాధవ్, రిజ్వాన్, భరత్ అజయ్, కమల్, కె గోపాల్, బి రాము, సిఐటియు నాయకులు షేక్ గౌస్‌మియా, ఎస్ రామనాథం, రాంప్రసాద్, ఐలు నాయకులు జె వెంకటరావు, దాసరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-నందిగామ: సంఘర్షణ సైకిల్ యాత్రకు నందిగామలో ఘన స్వాగతం లభించింది. నందిగామ మండలం అనాసాగరం జిల్లా పరిషత్ స్కూల్, నందిగామ పట్టణంలోని జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్, చైతన్య జూనియర్ కాలేజీ, కెవిఆర్ కళాశాల, ఎస్‌సి, ఎస్‌టి, బిసి హాస్టళ్లను నాయకులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో నందిగామ నాయకులు కాజు, పునీత్ వర్మ, సిఐటియు మండల కార్యదర్శి కె.గోపాల్, కర్రి వెంకటేశ్వరరావు, హసన్, కాసిమ్ పాల్గొన్నారు.

మైలరంలో యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మైలవరం: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్‌యాత్ర ఈ నెల 9వ తేదీన మైలవరం రానున్నదని ఈ యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం చరణ్ తేజ్, వి.అజయ్ కుమార్లు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్ ఎఫ్ ఐ కార్యాలయంలో గురువారం విలేకరులతోమాట్లాడుతూ జిల్లాలోని సంక్షేమ హాస్టల్స్ సమస్యలు పరిష్కరించాలని, కాస్మోటిక్ చార్జీలు వెంటనే ఇవ్వాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాల పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని, విద్యా రంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎల్ గణేష్, సాగర్, మురళీధర్ పాల్గొన్నారు.

తిరువూరులో ఈక్రాప్ నమోదు చేస్తున్న అధికారి

ఈక్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-వీరులపాడు: రైతులు తమ పంటలను ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.జోగేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈక్రాప్ నమోద్దైన వారికి మాత్రమే పంట నష్టపరిహారం, వైఎస్సార్ ఉచిత పంటల భీమా పథకం, సున్నా వడ్డీ పంట రుణాలు, కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడం మొదలైనవి వర్తిస్తాయని వర్తిస్తాయని పేర్కొన్నారు. ఈక్రాప్ నమోదుకు ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని తెలిపారు. **ప్రజాశక్తి-తిరువూరు:** రైతులంతా ఈ పంట నమోదు ప్రక్రియను పూర్తి చేయించుకుని వేలిముద్రలు వేసి ధ్రువీకరించు కోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి పి.పద్మ సూచించారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఖరీఫ్ సీజన్ 2023 ఈ-పంట నమోదు ప్రక్రియను ఆమె గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట నమోదు చేసుకుని ప్రభుత్వ పథకాలైన సున్నా వడ్డీ పంట రుణాలు, పంట నష్టరిహారం, ఉచిత పంటల భీమా, మరియు పంట అమ్ముకోవడానికి అర్హత పొందాలని రైతులకు ఆమె వివరించారు.

ఓటరు జాబితా పరిశీలన

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణ పరిధిలో ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, మునిసిపల్ కమిషనర్ డా. ఎస్.జయరాం గురువారం పరిశీలించారు. నందిగామ పోలింగ్ స్టేషన్ 80, 105 పరిధిలో ఫారం-7 అప్లికేషన్‌లను డోర్ టు డోర్ తనిఖీ చేశారు. ఫారం-7 లో నమోదు చేసిన డెత్, పెర్మినేంట్ మైగ్రేషన్ మొదలగునవి ఓటర్ల జాబితాలను పరిశీలించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు నిమిత్తం అందిన దరఖాస్తులను పరిష్కరించడంలో సక్రమమైన రికార్డులను ఫైల్ చేసుకోవాలని బూత్ లెవెల్ అధికారులకు తగు సూచనలు చేశారు.

హెచ్‌ఎంను సన్మానిస్తున్న విద్యార్థులు

హెచ్‌ఎం నరసింహస్వామికి సన్మానం

ప్రజాశక్తి-నందిగామ: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ఆధ్వర్యంలో నందిగామ మండలం పెద్దవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్ ప్రధానోపాధ్యాయులు ఎన్ నరసింహస్వామిని ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి నందిగామ డివిజన్ ఇన్‌చార్జ్ ఎం.శ్రీనివాసరావు, నందిగామ విలేకరి ఎవి నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

బిఒఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: బ్యాంక్ ఆఫ్ ఇండియా 118వ సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కోదాడ రోడ్డులోని జగ్గయ్యపేట బ్రాంచ్‌లో గురువారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ వేల్పుల ముత్తేశ్వరరావు మాట్లాడుతూ సుమారు పది వేల మందికి పైగా ఖాతాదారులుకు బ్యాంకు సేవలను అందిస్తోందని తెలిపారు.

ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సిబ్బంది

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీశ్రీ స్వామి రామానంద సరస్వతి స్వామి వారి జన్మదినాన్ని పురస్కరించుకొని హెచ్‌ఐవి బాధిత పిల్లలకు పౌష్టికాహారాన్ని అంద జేయడం జరిగిందని ఆ సంస్థ వ్యవస్థాపకులు సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కర్లపాటి మాట్లాడుతూ ఐదు వేల రూపాయల విలువైన ఆహార సామాగ్రిని బాలలకు అందజేసినట్లు చెప్పారు.

దుర్గమ్మ సన్నిధిలో మంత్రి రోజా

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కె.రోజా, రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వాహణాధికారిణి దర్భముళ్ల భ్రమరాంబ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

'లిటిల్ బ్రెయిన్స్'లో కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

సిద్ధార్థ నగర్లోని లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో గురువారం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. బాలబాలికలను తల్లిదండ్రులు చిన్నికృష్ణ గోపికలుగా అలంకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉట్టి కొట్టి విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని సంస్థ డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి తెలిపారు. ఆటలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సుధ ప్రవీణ ముక్తేవి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

హెచ్‌డిఎఫ్‌సి 'కార్డ్‌లెస్ ఈజీ ఇఎంఐ' ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ఎండ్-టు-ఎండ్ డిజిటల్ కన్స్యూమర్ లోన్‌లు, 'కార్డ్‌లెస్ ఈజీఈఎంఐ'లను అందుబాటులోకి తీసుకువచ్చామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రీజనల్ ఇంఛార్జి ఎస్. విశ్వనాధ్ తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అందరికీ రుణాన్ని అందించేందుకు 100 శాతం డిజిటల్-ఫస్ట్ పే లేటర్ ప్లాట్‌ఫారమ్ షాప్‌సేతో బ్యాంక్ భాగస్వామ్యం కుదుర్చుకుందనీ అన్నారు. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2023లో ప్రారంభించిన ఈ వినూత్న ఆఫర్ పూర్తిగా డిజిటల్, వేగవంతమైన రుణాల అనుభవం వైపు గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. అన్నారు. 'కార్డ్‌లెస్ ఈజీఈఎంఐ' పథకం ద్వారా భౌతిక పత్రాలు లేదా సహాయం అవసరం లేకుండా రుణ ప్రయోజనాలను తేలికగా అందుకునుందకు వినియోగదారులకు సాధికారత కల్పిస్తుంది.అని తెలిపారు. బ్రాండ్‌లు, వ్యాపారులతో ఈ లోతైన అనుసంధానం ద్వారా వినియోగదారులు అందరూ ఐదు నిమిషాల్లోపు రుణాన్ని పొందగలుగుతారని తెలిపారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

దాములూరు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ఎస్‌కె కరీంబి మృతి పార్టీకి తీరని లోటని మండల టిడిపి అధ్యక్షులు రామినేని రాజా అన్నారు. గ్రామ టిడిపి నాయకులు చెరుకుమల్లి చిట్టిబాబు , నల్లూరి పెద్దా అప్పారావు, షేక్ కాజాలతో కలిసి గురువారం కరీంబి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.